

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం 28 అక్టోబరు 2025



లక్కు.. కిక్కు



ఇల్లందుక్లబ్ హాలులో వేచి చూస్తున్న దరఖాస్తుదారులు, డ్రా తీసి గెలిచిన టోకెన్‌ను చూపిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

- మద్యం దుకాణాలు ఖరారు చేసిన ఎక్సైజ్ శాఖ
- డ్రా తీసిన కలెక్టర్ రాహుల్ శర్మ
- వ్యాపారుల్లో ఆద్యంతం ఉత్కంఠ
- అదృష్టం వరించిన వారి ముఖాల్లో ఆనందం
- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో 57 షాపుల కేటాయింపు
- మహిళకు దక్కిన టాప్-1 దుకాణం

కృష్ణకాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపు లకు సోమవారం నిర్వహించిన లక్కీ డ్రా ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. భూపాలపల్లిలోని మం జూర్‌నగర్‌లో ఉన్న సింగరేణి ఇల్లందు క్లబ్ హౌస్‌లో ఈ ప్రక్రియ కొనసాగింది. మద్యం దుకాణాలను దక్కించుకొనేందు కు దరఖాస్తుదారులు ఎవరి ముఖం చూసినా టెన్షన్ కనిపించింది. తమకు షాపు దక్కుతుందో లేదోననే ఆందోళన నెలకొంది. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని 59 మద్యం షాపులకు 1,863 దరఖాస్తులు రాగా, చల్వా యి, గోవిందరావుపేట మినహా 57 షాపులకు టెండర్ల ప్రక్రియ కొనసాగింది. ముఖ్య అతిథిగా హాజరైన భూ పాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ లక్కీ డ్రా తీసి ఎంపికైన వ్యాపారుల పేర్లు ప్రకటించారు.

గెజిట్ నెంబర్ ఆధారంగా..

సింగరేణి ఇల్లందు క్లబ్‌హౌస్‌కు ఉదయం 8 గంటలకు టెండర్ బా క్సులను తీసుకొచ్చారు. జోన్ల వారీగా ఉన్న బాక్సులను 11 గంటలకు కలె క్టర్ సమక్షంలో తెరిచారు. దరఖాస్తులను గెజిట్ నోటిఫికేషన్ వరుస ప్రకారం పొందుపరిచారు. తొలుత భూపాలపల్లి జోన్‌కు సంబంధించిన దంరఖాస్తుదారులను ఆహ్వానించారు. దరఖాస్తుదారులకు కేటాయించిన నెంబర్లను టోకెన్ల ద్వారా బాక్సులో వేయించారు. వాటిలోంచి కలెక్టర్ రాహుల్‌శర్మ ఒక్కొక్కటిగా తీస్తూ అదృష్టం వరించిన వారి పేర్లను ప్రకటించారు.

పకడ్బందీగా డ్రా

లక్కీ డీప్‌ను పకడ్బందీగా నిర్వహించారు. ఈ ప్రక్రి యను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించేందుకు మొదటి నుంచి చివరి దాకా వీడియో చిత్రీకరించారు. ఇల్లందు క్లబ్‌హౌస్‌లోకి ఎంట్రీ పాస్ ఉన్న వ్యక్తులను, విలేకరులను మాత్రమే అనుమతించారు. టోకెన్ నెంబ ర్ల ప్రకారం దరఖాస్తుదారులను పిలుస్తూ డ్రా పూర్తి చే శారు. నెంబర్లను అందరికీ చూపిస్తూ కలెక్టర్ సైతం ఆ బాక్సును చూడకుండా డ్రా తీశారు. ఈ నేపథ్యంలో దర ఖాస్తుదారులతో హాలు కిక్కిరిసిపోగా వారిని వరుస క్రమంలో ఉంచడం అధికారులకు సాధ్యపడలేదు. దీంతో వచ్చిన వారితో గజిబిజీ వాతావరణం ఏర్పడింది.

సిండికేట్లకు చుక్కెదురు

జిల్లాలో నూతన మద్యం దుకాణాలను దక్కించుకు నేందుకు జతకట్టిన సిండికేట్లకు చుక్కెదురైంది. ఎవరూ ఊహించని రీతిలో కొంత మంది సిండికేట్లకు ఒక్కషాపు కూడా దక్కలేదు. ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు, పార్టనర్స్‌గా వివిధ దుకాణాలకు దరఖాస్తులు సమర్పిం చిన వారికి సైతం చెక్కెదురైంది. మద్యం వ్యాపారంలో ఆరితేరిన వ్యక్తిగా పేరున్న ఓ వ్యాపారి సుమారు 70 దరఖాస్తులు దాఖలు చేయగా ఆయనకు ఏ ఒక్కటి కూడా డ్రాలో వెళ్లలే దు. అలాగే, జిల్లా కేంద్రానికి చెందిన మరో వ్యక్తి తన సన్నిహితులతో జతకట్టి 49 దరఖాస్తులు దాఖలు చేయగా ఆ గ్రూపునకు ఒక్క షాపు కూడా అదృష్టం వరించలేదు. ముగ్గురు నలుగురు మాత్రమే కలిసి వేసి న దరఖాస్తుల్లో ఒకటి రెండు షాపులు చేజిక్కాయి. ఇదిలా ఉండగా డ్రా లో దుకాణాలు దక్కని లిక్కర్ డాన్లు, ఈ వ్యాపారంతో సంబంధంలేని డ్రాలో గెలుపొందిన వ్యక్తులతో హాలులోనే మంతనాలు మొదలెట్టారు.

మహిళకు దక్కిన మల్లంపల్లి షాపు

రెండు జిల్లాల్లో అత్యధికంగా దరఖాస్తులు ములుగు (మిగతా 8లో)



- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పేరిట ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల్లో తిష్ట
- అనుమతులు లేకున్నా ఇష్టారాజ్యంగా ఔట్‌సోర్సింగ్‌లో భర్తీ
- లేని ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నట్లుగా కొన్ని ఏజెన్సీల బురిడీ
- నకిలీల పేరుతో కోట్లు కొల్లకొడుతున్న కేటుగాళ్లు
- పీఎఫ్‌లు మాయం.. ఆరేడు నెలలకు ఒకసారి వేతనాలు
- అర్హులైన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను గుర్తించే పనిలో సర్కారు
- ఉమ్మడి జిల్లాలో 25 వేల మందికి పైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

'ఔట్‌సోర్సింగ్' అక్రమార్కులకు చెక్

ప్రభుత్వ శాఖల్లో బోగస్ ఉద్యోగులపై ప్రభుత్వం నజర్

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ప్రభుత్వ కార్యాలయాలు, అస్పత్రుల్లో తిష్ట వేసిన నకిలీ ఉద్యోగులపై సర్కారుపై దృష్టి పెట్టింది. ఉద్యోగులు లేకున్నా.. ఉన్నట్లుగా బోగస్ రికార్డులు చూపించి వేతనాలు డ్రా చేసుకుంటున్న ఏజెన్సీలు ఉన్నాయి. పని భారం తగ్గించుకునేందుకు అనవసరంగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కొంతమంది అధికా రులు బినామీ ఉద్యోగులను నియమించుకు న్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో కోట్లాది రూపాయలు వేతనాల రూపంలో పక్కదారి పడుతున్నట్లుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో నకిలీ ఉద్యోగులపై నజర్ వేసింది. నకిలీలను గుర్తించేందుకు ఆయా ఉద్యోగుల ఆధార్ కార్డు, బ్యాంకు, పాన్‌కార్డు తదితర వాటిని సమర్పించాల్సిందిగా ఆయా శాఖల ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఆదే శాలు జారీ చేసింది. దీంతో బినామీ పేర్లతో ఏళ్ల తరబడి కోట్లు కొల్లగొట్టిన ఏజెన్సీల్లో గుబులు షురువైంది.

కార్యాలయాల్లో ఔట్ సోర్సింగ్ సేవలు

ప్రభుత్వ అస్పత్రులతో పాటు కార్యాలయా ల్లో సిబ్బంది కొరతను తీర్చేందుకు ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ విధానంలో ఏజెన్సీల ద్వారా ఉ ద్యోగ నియమాకాలు చేపడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైద్యశాఖతో పాటు రెవె న్యూ, మునిసిపాలిటీ, కార్పొరేషన్‌లు, విద్యా శాఖ, పంచాయతీరాజ్, మహిళ, శిశు సంక్షేమ శాఖ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, డీఆర్‌డీఏ తది తర శాఖలతో పాటు వరంగల్ ఎంజీఎం, సీకేఎం అస్పత్రులు, అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 25వేల మందికి పైగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారని అంచనా.

ఆయా శాఖల్లో ఏళ్ల తరబడి ఖాళీ పోస్టుల ను భర్తీ చేయకపోవటం, కావాల్సినంత రెగ్యు లర్ ఉద్యోగులు లేకపోవటంతో తాత్కాలిక ప్ర తిపాదికన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియ మించుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీరిలో ఎక్కువగా కంప్యూటర్ ఆపరే టర్లు, జూనియర్ అసిస్టెంట్లు, స్వీపర్లు, స్టాఫ్ నర్సులు, ఆశ వర్కర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, డ్రైవర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఆయాలు తది తర విభాగాల్లో పొరుగు సేవలు అందిస్తు న్నారు. వీటిలో అత్యధికంగా వైద్యశాఖలోనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. అయితే వీరిలో వరంగల్ నగరంలోనే 70శాతం మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు దీటు గా సేవలు అందిస్తున్నప్పటికీ అరకొర వేతనా లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఔట్‌సోర్సింగ్‌తో అక్రమ దందా

ప్రభుత్వం ప్రతీ నెలా కోట్లాది రుపాయలు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనా ల రూపంలో చెల్లిస్తోంది. అయితే అనేక కార్యా లయాల్లో అవసరానికి మించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉండటం.. ఉద్యోగులు లేకున్నా ఉ న్నట్లుగా బినామీ రికార్డులు సృష్టించి కోట్లాది రుపాయలు వేతనాల రూపంలో విత్‌డ్రా చే సుకుంటున్న సంఘటనలు వెలుగులోకి

(మిగతా 7లో..)

అవినీతి రహితంగా వ్యవహరిస్తేనే మనుగడ



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సింగరేణి జీఎంలు రాజేశ్వర్‌రెడ్డి, సాయిబాబా

కృష్ణకాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహితంగా వ్యవహరిస్తేనే సంస్థ మనుగడ సాధ్యమని సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను ప్రాజెక్టు ప్లానింగ్ జనరల్ మేనేజర్ సాయిబాబాతో కలిసి ప్రారంభించారు. ముందుగా వారోత్సవాల కరపత్రాన్ని చదివి ఉద్యోగులకు అవగాహన కల్పించి అవినీతి రహిత సమాజం కోసం కృషి చేస్తామనే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జీఎం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు నిబద్ధత, న్యాయబద్ధంగా వ్యవహరిస్తే అవినతి దానంతట అదే అంతమవుతుందన్నారు. ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం కవీంద్ర, అధికారులు ఎర్రన్న, రవీందర్, రాజేశ్వర్, శైలేంద్రకుమార్, కావూరి మారుతి, వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

మహా జాతరకు సన్నద్ధం కావాలి

- ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేయాలి
- భక్తులకు సౌకర్యాలు మెరుగుపర్చాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

7



సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఎఫ్‌ఎండీ వ్యాక్సినేషన్ తప్పనిసరి



వ్యాక్సినేషన్‌ను పర్యవేక్షిస్తున్న డీవీఏహెచ్‌వో కుమారస్వామి

పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి కుమార స్వామి

కాటారం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గాలికుంటు నివారణ టీకాల (ఎఫ్ ఎండీ)ను పశువులకు తప్పనిసరిగా వేయించాలని పశు సంవర్ధక శాఖ జి ల్లా అధికారి డాక్టర్ కుమారస్వామి అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యం లో ఉచితంగా వీటిని ఇస్తున్నట్టు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల పరిధిలో ఆవు, గేదె జాతి పశువులకు సోమవారం ఏర్పాటు చేసిన ఎఫ్‌ఎం డీ వ్యాక్సినేషన్‌ను ఆయన పరిశీలించారు. నవంబరు 14వరకు టీకాలు వేసే కార్యక్రమం ఉంటుందని, అన్ని పశువులకు గాలికుంటు వ్యాధి నివా రణ టీకాలు వేయాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. మండ లంలో ఇప్పటి వరకు 3,500కు పైగా పశువులకు టీకా లు వేసినట్లు వెటం ర్నరీ వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వెటర్న రీ వైద్యా.దికారి డాక్టర్ రమేష్, డాక్టర్ ధీరజ్, వెటర్నరీ అసిస్టెంట్లు రాజశేఖర్, కిషన్, గోపాలమిత్ర, పశుమిత్రలు శ్రీనివాస్, నజీమా, అక్రమ్ పాల్గొన్నారు.

ప్రజా దివస్‌లో పది దరఖాస్తులు

కృష్ణకాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ప్రజాదివస్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించా రు ఎస్పీ కిరణ్ ఖరే నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి పది మంది వచ్చి వివిధ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. అనంత రం వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఫోన్‌లో ఆదేశించారు. ప్రజలు పైరవీరులు లేకుండా నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.



బాధితుల సమస్యలు తెలుసు కుంటున్న ఎస్పీ కిరణ్‌ఖరే

గంజాయి పట్టివేత



విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఏటూరునాగారం అడిషనల్ ఎస్పీ శివం ఉపాధ్యాయ

- ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు అరెస్టు
- పరారీలో మరో నలురుగు

ఏటూరునాగారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 7 లక్షల విలువ చేసే 14.213 కిలోల గంజాయిని, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో వివరాలు వెల్లడించారు.

ఈనెల 26న మధ్యాహ్నం ఒంటి గంటల సమయంలో భద్రాచలం వైపు నుంచి ములుగు జిల్లాలోని వెంకటాపురం మీదుగా ములుగు వైపు ఆరుగురు వ్యక్తులు మూడు మోటార్ సైకిళ్లపై గంజాయిని తరలి స్తున్నారనే సమాచారం వెంటాపురం ఎస్సైకు అందింది. వెంటనే ఎస్సై తమ సిబ్బందితో కలిసి వెంటాపురం మండలం నూగూరు గ్రామ శివారు లో వాహనాల తనిఖీ నిర్వహించారు. సాయంత్రం 5 గంటల సమయం లో వెంకటాపురం వైపు నుంచి ఏటూరునాగారం వైపుకు మూడు మోటార్ సైకిళ్లపై ఆరుగురు వ్యక్తులు రావడం గమనించిన పోలీసులు వారిని ఆపేందుకు ప్రయత్నించారు. ముందు మోటార్ సైకిల్‌పై ఉన్న ఇద్దరిని పట్టుకోగా, వెనక ఉన్న మరో రెండు బైకులపై ఉన్న నలుగురు పోలీసులను గమనించి వాహనాలను వెనక్కి తిప్పుకునే ప్రయత్నంలో అక్కడే స్కిడ్ అయ్యి పడిపోయారు. దీంతో, వారి వద్ద ఉన్న గంజాయి బ్యాగులను, ద్విచక్రవాహనాలను వదిలివేసి పక్కనే ఉన్న పంట పొలాల ద్వారా సమీపంలోని అడవిలోకి పారిపోయారు. అనంతరం పోలీసులు పట్టుకున్న ఇద్దరిని విచారించగా తమ పేర్లు తాటి ఇర్మా అలియాస్ సత్యం, మడకం రాయియెర్ర అలియాస్ రమేష్ అని వారు తెలిపారు. వీరిద్దరూ ఒడిశ్సా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా మన్నెంకొండ మండలం పెంకరాయ గ్రామానికి చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. పట్టుబడిన నిందితులు, పరారీలో ఉన్న (మిగతా 8వ పేజీలో)

కొనుగోలు కేంద్రాల్లోనే

పత్తిని విక్రయించాలి

- కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి
- రైతులు నష్టపోవద్దు
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

8వ పేజీలో..

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలి
- టెన్త్‌లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క

ములుగు రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు మండలం మాధవరావుపల్లిలో రూ.2.30 కోట్లతో ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ తరగతి గదులు, ప్రయోగశాలలను కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణితో కలిసి మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో బాలికలకు విద్య అవసరం లేదన్నట్టు వంట గదికే పరిమితం చేసేవారని గుర్తు చేశారు. ఇప్పుడు మహిళలు ఉన్నత చదువులు చదివి అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన అవకాశాలను కల్పిస్తోందని తెలిపారు. బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి ప్రగతి పథంలో ముందుకు సాగాలని అన్నారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తెచ్చి పెట్టాలన్నారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ ఉపాధ్యాయులు బాలికలను సొంత పిల్లలుగా భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ ఇంజనీర్(ఈఈ) అరుణ్ కుమార్, డీఈవో సిద్ధార్థ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



కస్తూర్బా పాఠశాల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ములుగు టౌన్(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సహకార సంఘం చైర్మన్ బొక్క సత్తిరెడ్డి ఆధ్వర్యంలో ములుగు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంటలను దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, కాంగ్రెస్ జిల్లా నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, పీఏసీఎస్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ కమిటీ చైర్మన్‌గా రవీందర్‌రెడ్డి ప్రమాణస్వీకారం

ఆత్మ కమిటీ చైర్మన్‌గా కొండం రవీందర్ రెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరగ్గా ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి పాల్గొన్నారు.



రవీందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సీతక్క

బుగులోని బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రేగొండ మండలం తిరుమలగిరి గ్రామ శివారులో నవంబరు 4 నుంచి 8 వరకు నిర్వహించే బుగులోని వెంకటేశ్వస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆవిష్కరించారు. గణపురం మండలంలోని బుద్దారం గ్రామంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బుగులోని జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. మెట్ల వెడల్పు, కోనేరు, కల్యాణ మండపం తదితర పనులు చేపడుతున్నట్టు చెప్పారు. వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, ఆలయచైర్మన్ రమణారెడ్డి, నాయకులు కట్ల మధుసూదన్‌రెడ్డి, నిమ్మల విజేందర్, ఆకుతోట తిరుపతి, మచ్చిక రాజు, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏలో గిరిజన దర్బార్



దర్బార్‌లో ఏపీవో వసంతరావుకు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

ఏటూరునాగారం రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ జరిగింది. గిరిజనులు పలు సమస్యలపై వినతులు సమర్పించారు. ఐటీడీఏ ఏపీవో వసంతరావు, డిప్యూటీ డైరెక్టర్ జనార్దన్ వాటిని స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 13 మంది వినతులు సమర్పించారు. మంగపేట, మహబూబాబాద్, మహదేవపూర్, తాడ్వాయి, వాజేడు, ఏటూరునాగారం, వెంకటాపురం, ఖానాపురం తదితర మండలాల నుంచి గిరిజనులు తరలివచ్చి వినతులు అందజేశారు. కారుణ్య నియామకాలు, ఎస్టీ కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్ల నిర్మాణాలు, మేడారం జాతర పనులు తుడుందెబ్బకు ఇవ్వడం తదితర సమస్యల పరిష్కారం కోసం అధికారులకు విన్నవించారు. ఏవో రాజ్‌కుమార్, ఎస్‌వో సురేష్‌బాబు, పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ పాల్గొన్నారు.

కాళేశ్వరానికి కార్తీక శోభ

- సోమవారం పోటెత్తిన భక్తులు



కాళేశ్వర ముక్తీశ్వరాలయంలో లక్ష వత్తుల కార్యక్రమంలో భక్తులు

మహదేవపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తీశ్వరాలయంలో కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీక మాసం సందర్భంగా సందడి నెలకొంది. త్రిలింగ దేశాలలో ద్రాక్షారామం, శ్రీశైలం, కాళేశ్వరానికి ప్రాముఖ్యత ఉన్నందున నెల రోజుల పాటు కార్తీక స్నానాలు గోదావరిలో ఉదయం నుంచే నిర్వహిస్తున్నారు. ఆలయంలో స్వామి వారికి మారేడు దళాలు సమర్పించి అభిషేకాలు, విశేష పూజలు చేశారు.

లక్ష వత్తుల కార్యక్రమం

కాళేశ్వరాలయంలోని ఉసిరిచెట్టు వద్ద రోజువారీగా లక్ష వత్తుల కార్యక్రమం జరుగుతోంది. సోమవారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు పాలు పంపిణీ చేశారు. అలాగే గోదావరి మాతకు చీర, సారె, కుంకుమ, పసుపులతోపాటు పలు ప్రత్యేక పూజలు జరిగాయి. గోదావరి హారతిని అర్చకులు ఘనంగా నిర్వహించారు.

రోడ్ల నిర్మాణం చేపట్టాలని రాస్తారోకో

- బీఆర్ఎస్ నేతల అరెస్టు



వాజేడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వరకు రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం వాజేడులోని మురుమూరు జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు పెనుమల్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గతంలో వాజేడు నుంచి భద్రాచలం వెళ్లేందుకు రెండు, మూడు గంటల సమయం పట్టేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరు, ఏడు గంటల సమయం పట్టే దుస్థితి ఏర్పడిందని అన్నారు. మండలంలో రోడ్లన్నీ గుంతలమయమై పూర్తిగా దెబ్బతిన్నాయని, దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరుతానని చెప్పి నేటికీ తట్టమట్టి కూడా పోసిన దాఖలాలు లేవని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ అభివృద్ధి మాత్రం శూన్యమని దుయ్యబట్టారు. రాస్తారోకో చేస్తున్నారనే విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

డీఎస్ఈ నుంచి ప్రశంసా పత్రం అందుకున్న జీసీడీవో గౌసియాబేగం

జనగామ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జనగామ జీసీడీవో గౌసియాబేగం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్(డీఎస్ఈ) నవీన్ నికోలస్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. గౌసియాబేగం విద్యాశాఖలో ఉద్యోగంలో చేరినప్పటి నుంచి విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ వారి సమగ్రాభివృద్ధికి దోహదపడుతున్నారు. రిసోర్స్ గ్రూపు సభ్యులుగా, డిజిటల్ పాఠాల ప్రజెంటర్‌గా, మాడ్యూల్, ప్రశ్నపత్రాల తయారీతో పాటు జిల్లా సైన్స్ అధికారిగా, జీసీడీవోగా బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్రంలోనే ఉత్తమ స్థానం కైవసం చేసుకున్నందుకు సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నవీన్ నికోలస్, జాయింట్ డైరెక్టర్ నర్సమ్మ, రాష్ట్ర జీసీడీవో శిరీష చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. గౌసియాబేగంను కలెక్టర్ రిజ్వాన్ బాషా, అడిషనల్ కలెక్టర్లు అభినందించారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న గౌసియాబేగం

గాయపడిన యువకుడి మృతి



సందీప్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండకు చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వారియర్ జోగు సందీప్ (18) చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. మీదికొండకు చెందిన సందీప్, ఆయన స్నేహితులు కొంపల్లి కార్తీక్, సింగపురం నితిన్‌తో కలిసి ఈ నెల 25న రాత్రి బైక్ పైన మీదికొండ నుంచి ఘన్‌పూర్ వైపు వెళ్తున్నారు. అదే మార్గంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో బైక్ ట్రాక్టర్ ట్రాలీని వెనుకాల వేగంగా ఢీకొట్టింది. దీంతో సందీప్, మిగితా ఇద్దరికి గాయాలయ్యాయి. ముగ్గురిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సందీప్ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి జోగు కళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

సోమన్న ఆలయంలో ఆగిన భక్తుడి గుండె

- మృతుడు చిన్నవంగరకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు
- జనగామ జిల్లా పాలకుర్తిలో ఘటన



సోమారెడ్డి (ఫైల్)

పాలకుర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి దర్శనం కోసం వచ్చిన భక్తుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన సోమవారం జనగామ జిల్లా పాలకుర్తి మండలకేంద్రంలో జరిగింది. ఆలయ అధికారులు, స్థానికుల కథనంప్రకారం..మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిన్నవంగరకు చెందిన పాకనాటి సోమారెడ్డి(65) కుటుంబ సభ్యులతో సోమేశ్వరాలయానికి దర్శనం కోసం వచ్చారు. గర్భగుడిలో శివుడికి అభిషేకం చేసి పక్కనే ఉన్న నర్సింహస్వామి దర్శించుకొంటున్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు, ఆలయ అధికారులు, ఎస్సై పవన్‌కుమార్‌లు సోమారెడ్డికి కార్డియో పల్మనరీ రీసెర్సిటేషన్(సీపీఆర్) చేశారు. ఓ ప్రైవేటు వాహనంలో వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సోమారెడ్డికి గతంలోనే గుండెకు స్టంట్ పడిందని కుటుంబ సభ్యులు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, రైతుబంధు మండల కన్వీనర్‌గా పనిచేశాడు.

ప్రాణం తీసిన అతివేగం

- లారీని ఢీకొట్టిన బైక్..
- యువకుడి మృతి.. మరో యువకుడి పరిస్థితి విషమం
- ఆర్టీసీ కాలనీ వద్ద ప్రమాదం





ప్రమాదంలో మృతి చెందిన సంజయ్, తీవ్రంగా గాయపడిన ప్రసాద్

లింగాలఘణపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యూటర్న్ తీసుకుంటున్న లారీని బైక్ ఢీకొట్టడంతో యువకుడు దుర్మరణం చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామ శివారు ఆర్టీసీ కాలనీ వద్ద జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన రాగి వెంకటయ్య, మల్లమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్నకుమారుడు రాగి సంజయ్(19), లింగాలఘణపురం మండలం నవాబుపేటకు చెందిన ప్రసాద్ ఇద్దరు స్నేహితులు. వీరు జనగామలో డిగ్రీ మొదటి సంవత్సరం చదవుతున్నారు. ఇద్దరు నెల్లుట్ల నుంచి జనగామకు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై అతివేగంగా వస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వస్తున్న లారీ సూర్యాపేట వైపునకు వెళ్లేందుకు ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు మీదుగా వచ్చి యూటర్న్ తీసుకుంటున్నారు. బైక్ నడుపుతున్న సంజయ్ అతివేగంగా వస్తూ లారీని గమనించక బలంగా ఢీకొట్టాడు. హెల్మెట్ లేకపోవడంతో సంజయ్, ప్రసాద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా సంజయ్ మృతి చెందాడు. ప్రసాద్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. హెల్మెట్ ధరించి ఉంటే సంజయ్ బతికేవాడని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

స్పందించని వాహనదారులు..

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు పోలీసులు వాహనదారులను బతిమిలాడినా ఏ ఒక్కరూ స్పందించకపోవడం బాధాకరం. ఘటనా స్థలానికి జనగామ జిల్లా ఆస్పత్రి మూడు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో 108 అంబులెన్స్ ప్రమాద స్థలానికి 11 కిలోమీటర్ల దూరంలో ఉందని సమాచారం అందుకున్న పోలీసులు అంబులెన్స్ రావడానికంటే ముందే ఆస్పత్రికి బాధితులను తీసుకెళ్లేందుకు అటుగా వచ్చే కార్లను, ఆటోలను, ఇతర వాహనదారులను ఎంత బతిమిలాడినా ఎవరూ స్పందించలేదు.

స్టేట్‌వేర్ హౌసింగ్ గోడౌన్ల నిర్మాణానికి రూ.6 కోట్లు



కొలతలు తీస్తున్న సిబ్బంది

కాటారం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణస్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రెండు గోడౌన్లు నిర్మాణం కానున్నాయి. కాటారం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల రెండు గోడౌన్లు నిర్మించడానికి రూ.6కోట్ల నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. పనులు చేపట్టడానికి టెండర్ దక్కించుకున్న సంస్థ సోమవారం సర్వే పనులు నిర్వహించింది. ఏఎంసీ స్థలంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోడౌన్ల నిర్మాణం చేపట్టనుంది. గోడౌన్లతోపాటు ప్రహరీ, బోర్, కార్యాలయ భవనం నిర్మాణం కానున్నాయి. త్వరలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా పనుల శంకుస్థాపన చేయించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తహసీల్ కార్యాలయంలో భార్యపై దాడి చేసిన భర్త



భార్యపై దాడి చేస్తున్న కుమార్‌ను అడ్డుకున్న సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, వివిధ గ్రామాల నుంచి రిజిస్ట్రేషన్స్ కోసం వచ్చిన వారి ఎదుటనే కట్టుకున్న భార్యపై భర్త దాడి చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... హన్మకొండ జిల్లా రాంపూర్‌కు చెందిన కొత్తపల్లి కుమార్-లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం రాంపూర్‌లో ఉన్న భూమిని విక్రయించడంతో వచ్చిన డబ్బులతో పాంనూర్‌లో భూమి కొనుగోలు చేశారు. కొన్ని నెలల క్రితం కుమార్ పాంనూర్‌లో కొంత భూమిని విక్రయించి డబ్బులను వృథా చేశాడు. దీనిపై కుటుంబ సభ్యులు నిలదీయడంతో గొడవలు జరిగాయి. అప్పటి నుంచి కుటుంబ సభ్యులను వదిలివేసి ఘన్‌పూర్‌లో ఉంటూ జల్సాలు చేస్తున్నాడు. భార్య లక్ష్మి కూలీనాలి చేస్తుండగా కుమారుడు రమేష్ ఆటో నడుపుతూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. కొన్ని రోజుల క్రితం కుమార్ కొందరు రియల్టర్లను పట్టుకొని పాంనూర్‌లో ఉన్న మిగితా భూమిని తక్కువ ధరలకు విక్రయించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. రిజిస్ట్రేషన్ చేస్తున్నాడని తెలుసుకున్న అతని భార్య, పిల్లలు తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి అడ్డుపడ్డారు. సోమవారం కుమార్ భూమి రిజిస్ట్రేషన్ చేయడానికి సిద్ధమైనట్లు తెలుసుకున్న లక్ష్మి తహసీల్దార్ కార్యాలయంకు రావడంతో గమనించిన కుమార్ ఎలాగైన అడ్డుపడుతుందని భావించిన అతను అందరి ముందర విచక్షణరహితంగా ఆమెను కొడుతూ పిడిగుద్దులతో దాడి చేశాడు. అక్కడే ఉన్న రెవెన్యూ సిబ్బంది, అక్కడికి వచ్చిన వారు కుమార్‌ను నిలువరించే ప్రయత్నం చేశారు. ఆమె రోదిస్తూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తలదాచుకున్నట్లు తెలిసింది.

త్వరలో యువజన క్రీడోత్సవాలు

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): త్వరలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో యువజన క్రీడోత్సవాలను నిర్వహించనున్నట్లు యువజన క్రీడల శాఖ అధికారి రఘు సోమవారం తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జానపద నృత్యం, సైన్స్‌మేళా, లైఫ్ స్కిల్స్ కాంపోనెంట్, కథా రచన, కవిత్వం, పెయింటింగ్ తదితర అంశాల్లో కార్యక్రమాలు ఉంటాయని, జిల్లా స్థాయిలో సైన్స్ అండ్ టెక్నాలజీలో ఇన్నోవేషన్‌ను ప్రతిబింబించేలా తమ ప్రాజెక్టులను ప్రదర్శించడం ద్వారా యువత ఈ మేళాలో నూతన చైతన్యం పొందుతారని తెలిపారు. జిల్లాకు చెందిన యువతకు మాత్రమే ఇందులో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ఉంటాయని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్

వెంకటాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను రెవెన్యూ అధికారులు సోమవారం పట్టుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చొక్కాల గ్రామ సమీపంలో గల గోదావరి ఇసుక పాయ నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం అందిందని అన్నారు. దీంతో సిబ్బందితోకలిసి దాడులు నిర్వహించి ట్రాక్టర్లు, జేసీబీని స్వాధీనం చేసుకుని రెవెన్యూ కార్యాలయానికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

● కాటారం(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఇసుకను తవ్వి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను పోలీసులు సోమవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్లలో ఇసుకను లోడ్ చేసి మహాముత్తారం తరలించే క్రమంలో పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు కొత్తపల్లి చింతకానిగ్రామానికి వెళ్లగా ట్రాక్టర్లలో ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను లోడ్ చేసి తరలిస్తుండగా పట్టుకున్నట్లు వెల్లడించారు. అక్రమంగా ఇసుక తరలింపుపై కాటారం గ్రామానికి చెందిన యశ్వంత్, సురేందర్, మహారాష్ట్రకు చెందిన శ్రీధర్ అనే ముగ్గురిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

జాతీయ కబడ్డీ పోటీలకు ఫారెస్టు అధికారులు





సురేందర్ రమేష్

కాటారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అటవీశాఖ ఆధ్వర్యంలో జరగనున్న 28వ ఏఐఎఫ్ ఎస్ఎం(ఆల్ ఇండియా ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్)-2025 కబడ్డీ జాతీయస్థాయి పోటీలకు కాళేశ్వరం జోన్ నుంచి ముగ్గురు అటవీశాఖ అధికారులు ఎంపికయ్యారు. ఇటీవల సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ స్థాయి, రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కాటారం డిప్యూటీ రేంజర్ సురేందర్, ఆజంనగర్ డిప్యూటీ రేంజర్ రమేష్, ములుగు జిల్లాకు చెందిన ప్రసాద్‌రావు ప్రతిభను కనబర్చారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర కబడ్డీ జట్టు సభ్యులు రాష్ట్ర అటవీశాఖ అకాడమీ దూలపల్లిలో నవంబరు 4 వరకు శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి నవంబరు 9న ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌కు బయల్దేరనున్నట్టు అధికారులు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అటవీశాఖ అధికారులను సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, మహదేవపూర్ ఎఫ్‌డీవో సందీప్‌రెడ్డి, కాటారం ఎఫ్ఆర్‌వో స్వాతి, ఇతర అధికారులు అభినందించారు.

విదేశీ విద్య కోసం ఎస్సీలు దరఖాస్తు చేసుకోవాలి

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ విద్యార్థులు ఉన్నత విదేశీ విద్య కోసం దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, సింగాపూర్, జర్మనీ, న్యూజీలాండ్‌లో ఉన్నత విద్యను అభ్యసించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించకూడదని తెలిపారు. పూర్తి వివరాలకు 9346227453 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



వరంగల్ ఎస్ఆర్ఆర్ తోటలోని ఓడీసీఎమ్మెస్ కార్యాలయ భవనం

ఓడీసీఎమ్మెస్ కనుమరుగేనా?

సహకార రంగంలో నాలుగు దశాబ్దాల ప్రస్థానం

- అన్నదాతలకు అండగా విలువైన సేవలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ. 200 కోట్ల ఆస్తులు
- ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన సొసైటీ
- ప్రభుత్వ విలీన నిర్ణయం పట్ల రైతుల్లో ఆందోళన

హనుమకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన ఓరుగల్లు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (ఓడీసీఎంఎస్) త్వరలో కనుమరుగు కానున్నదా ? సహకార రంగంలో తనదైన ప్రత్యేకతను నిలుపుకుంటూ లక్షలాది మంది రైతులకు సేవలు అందించిన ఈ సొసైటీ తన ఉనికిని కోల్పోనున్నదా ? ఉమ్మడి వరంగల్ జిల్లాలో విశిష్టమైన చారిత్రక నేపథ్యాన్ని కలిగిన ఓడీసీఎంఎస్ ఒకప్పుడు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)తో సమానంగా పోటీ పడింది. డీసీసీబీ అన్నదాతలను రుణాల పరంగా ఆదుకుంటే డీసీఎంఎస్ ఎరువులు, విత్తనాలను అందజేయడం, పంట ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేయడం ద్వారా వెన్నుదన్నుగా నిలిచింది. ఓడిసిఎమ్మెఎస్ ఒక దశలో ఒక వెలుగు వెలిగింది. రాజకీయ నాయకులు ఓడీసీఎంఎస్‌కు చైర్మన్‌గా ఉండడం గొప్ప గౌరవంగా భావించేవారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఓడీసీఎంఎస్‌కు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ. 200 కోట్లకుపైగా ఆస్తులుఇప్పటికీ ఉన్నాయంటే ఈ సంస్థ గత ప్రాభవం ఏమిటో, సహకార వ్యాపార రంగంలో అది నిర్వహించిన క్రియాశీల భూమిక ఏమిటో అర్థం చేసుకోవచ్చు. రైతుల దగ్గర నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లింగ్ చేయడానికి జిల్లా చరిత్రలో తొలి సారి రైస్ మిల్లును సమకూర్చుకున్న ఘనత దీనికి ఉంది. ధాన్యాన్ని మరాడించి బియ్యాన్ని సరఫరా చేయడం ద్వారా అటు వ్యాపార పరంగా లాభాలు గడించడమే కాకుండా ఇటు రైతులను పరోక్షంగా ఆదుకున్న సహకార మార్కెటింగ్ సొసైటీ ఇది. మారిన పరి స్థితులు, సహకార రంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా తనను తాను నిలదొక్కుకోలేక క్రమంగా నష్టాల్లో కూరకుపోయి నప్పటి కీ తర్వాత నిలదొక్కుకొని తిరిగి లాభాల్లోకి రాగలిగింది. ప్రస్తుతం లాభాల బాటలో నడుస్తున్న ఓడీసీఎంఎస్ ప్రభుత్వం తీసుకోబోతున్న నిర్ణయంతో కాల గర్భంలో కలిసిపోనుండడం అన్నదాతలను ఆవేదనకు గురి చేస్తోంది.

విలీనం

వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఉండి గుడిబండలా మారిన కార్పొరేషన్లను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చే చర్యల్లో భాగంగా కొన్నింటిని విలీనం, అవసరం లేనివాటి రద్దుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ ప్రక్రియలో ముందుగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలు (డీసీఎమ్మెస్‌లు) కనుమరుగుకానున్నది.ఈ క్రమంలో ఓరుగల్లు జిల్లా సహకార మార్కెట్ సొసైటీ సైతం విలీనం ఖాయంగా కనిపిస్తోంది. విలీన ప్రక్రియకు ప్రతిపాదనలు పంపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో డీసీఎమ్మెస్‌లు ఉన్నాయి. వీటి మూసివేతకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది.

గతంలోనే విలీనం ఆలోచన

ఆ తర్వాత ఓడీసీఎంఎస్ పుంజుకున్నది. స్వంతంగా వ్యాపార కార్యకలాపాలను నిర్వహించ సాగింది. ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘాలకు (పీఏసీఎస్) పోటీగా మారింది. ఈ క్రమంలో పీఏసీఎస్‌ల మనుగడ కోసం ఓడీసీఎంఎస్‌తో పాటు మరికొన్ని డీసీఎంఎస్‌లను మార్క్‌ఫెడ్ లో విలీనం చేయాలనే ఆలోచన అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది. ఎందుకో ఆ తర్వాత ఇది ఆచరణలోకి రాలేదు. తాజా ఇప్పుడు మరో సారి విలీన ప్రతిపాదన తెరమీదికి వచ్చింది. రాష్ట్రంలో ఏవో కొన్ని డీసీఎమ్మెస్‌లు నష్టాల్లో నడుస్తున్నాయన్న, రైతులకు వాటి అవసరం లేదన్న కారణంతో ఓడీసీఎంఎస్‌తో సహా అన్నిటిని విలీనం చేయాలని నిర్ణయం తీసుకోవడం పట్ల రైతుల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. డీసీఎమ్మెఎస్‌లు మొదట్లో విత్తనాలు, ఎరువుల సరఫరా, పంటల కొనుగోళ్ల చేపట్టేవి. ఆ తర్వాత పౌరసరఫరాల సంస్థ ధాన్యంకు ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం అప్పగించింది. మార్క్‌ఫెడ్ మక్కలు, పప్పు ధాన్యాలు, నూనే గింజలు కొనుగోలు చేస్తోంది. దీంతో డీసీఎమ్మెస్‌లకు చైర్మన్లు, డైరెక్టర్ల నియామకం, గౌరవ వేతనం, వాహనాలు, ఇంటి అద్దెలు తదితరాలు చెల్లిస్తుండడంతో నిర్వహణ వ్యయం భారీగా పెరిగినందు వల్ల ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర సహకార శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. మిగతా డీసీఎమ్మెఎస్‌ల కన్నా ఓడీసీఎమ్మెఎస్ పరిస్థితి భిన్నం. దీని కింద ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ200 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. ఒక్క వరంగల్ ఎస్ఆర్‌తో టలోనే రెండెకరాల స్థలం ఉంది. దీని విలువనే రూ. 50 కోట్లకు పై చేస్తుంది. ఓడీసీఎమ్మెస్‌కు ప్రస్తుతం ఎలాంటి అప్పులు లేవు. 40 కేంద్రాల ద్వారా ఓడీసీఎమ్మెస్ ధాన్యం కొనుగోలు చేసి ప్రతీ సీజన్‌లో కమిషన్ రూపంలో సుమారు రూ 30 లక్షలు, ఎరువుల అమ్మకం ద్వారా రూ. 15లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తోంది. ఈ సంస్థలో ప్రస్తుతం ఆరుగురు ఉద్యోగులు పని చేస్తున్నారు.

నలబై ఏళ్ళ క్రితం..

సహకార రంగంలో ఒకప్పుడు రెండంచెల వ్యవస్థ ఉండేది. రైతులకు పంటలు, వ్యవసాయ పని ముట్లు కొనుగోలు తదితర వాటి కోసం భూ తనఖా బ్యాంకులు (ఎల్ఎంబీ), ప్రాథమిక సహకార సంఘాలు (పీఏసీఎస్) ఉండేవి. ఎల్ఎంబీలు ఆ తర్వాత వ్యవసాయాభివృద్ధి బ్యాంకులుగా (ఎల్‌డీబీ) మారాయి. పీఏసీఎస్‌లు స్వల్పకాలిక రుణాలు ఇస్తే ఎల్ఎంబీలు దీర్ఘకాలిక రుణాలు ఇచ్చి రైతులను ఆదుకునేవి. తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ముఖ్య మంత్రి ఎన్‌టీ రామారావు 1987లో సహకార వ్యవస్థలో సంస్కరణలను ప్రవేశపెట్టారు. ఏకగవాక్ష విధానం (సింగిల్‌విండో) తీసుకువచ్చారు. రైతులకు కావలసిన పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు ఇతర ముడిసరుకుల పంపిణీ సింగిల్ విండో ద్వారానే జరిగేలా మార్పులు చేశారు. ఇందులో భాగంగా ఎల్ఎంబీలను డీసీసీబీలో విలీనం చేసి దీర్ఘ, స్వల్పకాలిక రుణాలను దీని ద్వారానే వితరణ జరిగేలా చూశారు. దీనితో మార్కెటింగ్ కార్యకలాపాలకు, పీఏసీఎస్‌లకు సంబంధం లేకుండా పోయింది. అప్పట్లో పాత తాలూకాల్లో ఉన్న సహకార మార్కెటింగ్ సొసైటీ (సీఎంఎస్)లను విలీనం చేసి జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లను ఏర్పాటు చేశారు. అలా మొదట్లో వరంగల్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డబ్ల్యుడీఎమ్మెఎస్) ఏర్పాటయింది. డబ్లుడీఎమ్మెఎస్ తీవ్ర నష్టాల్లో కూరుకుపోవడంతో దానిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి లాభాల్లో ఉన్న వరంగల్, నర్సంపేట, మహబూబాబాద్ సీఎంఎస్‌లను విలీనం చేసి ఓరుగల్లు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (ఓడీసీఎమ్మెఎస్)గా మార్చారు. అలా 1987లో ఏర్పాటయింది. ఆ తర్వాత కాలంలో పరకాల సీమ్మెఎస్‌లు కూడా ఓడీఎఎమ్మెస్ పరిధిలోకి వచ్చాయి. జనగామ పీఏసీఎస్ ఆదీనంలోకి వెళ్లిపోయింది.

ఆస్తి కోసం బతికుండగానే చంపేశారు..

- తప్పుడు పత్రాలతో రూ.20కోట్ల ఆస్తి రిజిస్ట్రేషన్
- కలెక్టర్‌ను, పోలీసులను ఆశ్రయించిన వృద్ధుడు



రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలు చూపిస్తున్న బాధితుడు

హనుమకొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తండ్రి బతికుండగానే మరణించినట్లు తప్పుడు పత్రాలు చూపి ఆస్తిని తన వారసులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఓ తండ్రి అధికారులకు ఫిర్యాదు చేసిన ఘటన హనుమకొండలో చోటు చేసుకుంది. బాధితుడు సయ్యద్ జమాలొద్దీన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండకు చెందిన జమాలొద్దీన్‌కు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. జమాలొద్దీన్ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. తనకు ఉన్న అపార్టమెంట్‌లలో ఫ్లాట్లు, ఇళ్ల, ఇంటి స్థలాలకు సంబంధించిన సుమారు రూ. 20 కోట్ల విలువైన ఆస్తులను గత సంవత్సరం 2024 మార్చి 18న తాను మరణించినట్లుగా చూపించి అప్పటి రిజిస్ట్రేషన్ అధికారి తప్పుడు పత్రాలతో తన ఆస్తిని కుమారుడు, కుమార్తెలు మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వాపోయాడు. వృద్ధాప్యంలో తనను ఎవరు పట్టించుకుంటారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నట్లు తెలిపారు. అనంతరం హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న పత్రాలతో ఆందోళన వెలిబుచ్చాడు.ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. 2025 మార్చి 26ననుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరుగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో తనను పట్టించుకోని కూతుళ్లు, కుమారుడు రిజిస్ట్రేషన్ చేసుకున్న తన ఆస్తిని అధికారులు రద్దు చేసి తన ఆస్తి తనకు దక్కేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరాడు. భార్య అనారోగ్యంతో మృతి చెందగా రెండో వివాహం చేసుకున్నానని తెలిపారు.

కవి పొట్లపల్లికి నబారా స్మారక పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న పొట్లపల్లి శ్రీనివాసరావు

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కవి పోషకుడు, న్యాయవాది నమిలికొండ బాలకిషన్‌రావు జ్ఞాపకంగా ఏర్పాటు చేసిన నబారా పురస్కారం -2025ను ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు అందుకున్నారు. శ్రీ రాజరాజ నరేంద్ర భాషా నిలయంలో జరిగిన కార్యక్రమంలో నబారా సొసైటీ అధ్యక్షులు నమిలికొండ పాంచాలరాయ్ అతిథులు మధ్య పొట్లపల్లికి పురస్కారం అందజేశారు. తెలంగాణ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, కవి బిల్ల మహేందర్ అధ్య క్షత వహించగా కవి, విమర్శకులు ఆచార్య బన్న అయిలయ్య మాట్లాడుతూ బాలకిషన్ రావు అనేక సాహితీ సంస్థలను ఏర్పాటుచేసి కవితా సంపుటాలను, సంకలనాలు ప్రచురించడమే కాకుండా ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రసారిక అనే పత్రికను స్థాపించి ఎందరో కవులను ప్రోత్సహించారని అన్నారు. ప్రముఖ కవులు ఎన్‌వీఎన్.చారి, నిధిలు బాలకిషన్‌రావు, పొట్లపల్లి శ్రీనివాసరావు కవిత్వం, వారి వ్యక్తిత్వాలను సమగ్రంగా ఆవిష్కరించి కొనియాడారు. పొట్లపల్లికి నబారా పురస్కారంతో పాటు జ్ఞాపిక, శాలువ, రూ. 5116 నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు గిరిజా మనోహర్ బాబు, విఆర్.విద్యార్థి, కవులు, పి.చందు, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, సముద్రాల శరగోపాచార్యులు, మోత్కూరు మనోహర్, శర్మ, కోడం కుమారస్వామి, తాడిచెర్ల రవి, తదితరులు పాల్గొన్నారు.



మానవహారం చేస్తున్న విద్యార్థులు

స్కాలర్‌షిప్పులు వెంటనే విడుదల చేయాలి

కేయూ క్రాస్‌రోడ్డులో ఏబీవీపీ మానవహారం

కేయూ క్యాంపస్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గత మూడేళ్ళగా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8500 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేస్తూసోమవారం కేయూ క్రాస్ రోడ్డు జంక్షన్‌లో ఏబీవీపీ నేతృత్వంలో నిరసనగా మానవహారం చేపట్టారు. ఫీజులు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలయాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీచేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సెక్రటరీ మాచర్ల రాంబాబు, కేయూ అధ్యక్షుడు ఉబ్బటి హరికృష్ణ, పూర్వరాష్ట్ర కార్యదర్శి అంబాల కిరణ్, కేయూ ఇన్‌చార్జి నిమ్మల రాజేశ్, సెక్రటరీ జ్ఞానేశ్వర్, ఫణీంద్ర, శివ, అబి. మెరగు సాయికుమార్ పాల్గొన్నారు.

మహా జాతరకు సన్నద్ధం కావాలి

- ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేయాలి
- భక్తులకు సౌకర్యాలు మెరుగపర్చాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మేడారం మహాజాతరకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఏర్పాట్లను అధికారులు ప్రారంభించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. భక్తులకు సౌకర్యాలను మెరుగు పరుస్తూ మహాజాతరకు సన్నద్ధం కావాలని ఆదేశించారు. మంత్రి సీతక్క మేడారంలో సోమవారం సాయంత్రం పర్యటించారు. మేడారంలో జరుగుతున్న వనదేవతల దేవస్థానం పునరుద్ధరణ పనులను ఎస్పీ శబరీశ్, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. వందల ఏళ్లు నిలిచేలా శాశ్వత పనులను ప్రభుత్వం చేపడుతున్న నేపథ్యంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

ఏర్పాట్లపై సమీక్ష

వనదేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్క తల్లుల గద్దెలకు మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు తల్లుల ప్రసాదాలను మంత్రికి అందజేశారు. దేవస్థానం సమీపంలోని ఐటీడీఏ అతిథి గృహంలో ఏపీవో వసంతరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా జాతర ఏర్పాట్ల సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. జాతీయ రహదారులపై చేపట్టిన మల్లంపల్లి, కటాక్షపూర్ వంతెనల నిర్మాణాలను జాతరలోగా పూర్తి చేసి భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. అడవి ప్రాంతాల్లో విద్యుద్దీకరణ మరమ్మతు పనులను చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులతో అన్నారు. అడవి ప్రాంతాల్లోని రహదారుల వెంబడి విద్యుత్ లైట్లు, సీసీ కెమెరాలు, నెట్‌వర్క్ టవర్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రత్యేక ఎల్‌టీ లైన్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతూ జంపన్నవాగులో భక్తులకు చేప ట్టాల్సిన బీవోటీ, బాతింగ్‌గాడ్స్, సుందరీకరణ పనులు వెంటనే చేపట్టాలని అన్నారు. ప్రధానంగా పారిశుధ్య పనులపై పంచాయతీరాజ్ అధికా రులు దృష్టి పెట్టాలన్నారు. మహా జాతరలో ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత, ప్రమాదాల నివారణ ప్రోటోకాల్ దర్శనాలు, పార్కింగ్‌లు, రోడ్డు భద్రతా నియమాలు తదితర అంశాలపై ఎస్పీ శబరీశ్‌తో మంత్రి చర్చించారు. గతంలో మాదిరిగా కాకుండా దేవస్థానం సమీపం వరకు భక్తులు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. మేడారంలో ప్రకృతి ప్రతి బించేలా స్మృతివనం, దేవస్థానం, జంపన్న వాగు, మ్యూజియం పరిసరాల్లో వివిధ రకాల చెట్లను పెంచాలని దానికి అటవీ అధికారులకు సూచించారు. అనంతరం భూనిర్వాసితులతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. భూములు కోల్పోతున్న ప్రతి రైతుకూ న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేశ్, డీఎస్పీ రవీందర్, పూజా రుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఔట్‌సోర్సింగ్' అక్రమార్కులకు చెక్

(5వ పేజీ తరువాయి)

వస్తున్నాయి. వరంగల్ ఎంజీఎంలో ఔట్‌సోర్సింగ్ విధానం అస్తవ్యస్థంగా మారింది. ఓ ఏజెన్సీ ఉద్యోగులు లేకున్నా ఉన్నట్లుగా రికార్డుల్లో బినామీ పేర్లను చేర్చి వేతనాల రూపంలో పెద్ద మొత్తంలో కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఎంజీఎంలో వివిధ విభాగాల్లో పనిచేయకున్నా.. చేసినట్లుగా నకిలీ రికార్డులు తయారు చేశారనే ఆరోపణలు వినిపించాయి. ఆరు నెలల కిందట ఇదే విషయం తెలుసుకున్న అధికారులు.. సదరు ఏజెన్సీకి వేతనాల బిల్లులు ఇవ్వకుండా నెలల తరబడి నిలిపివేశారు. ఆ తరువాత తన పలుకుబడిని ఉపయోగించి నిలిపివేసిన వేతనాల బిల్లులను సదరు ఏజెన్సీ డ్రా చేసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇక ఆయా శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులే బినామీ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీని రిజిస్ట్రేషన్ చేయించుకుని అక్రమ దందాకు దిగుతున్నారు. జనగామ మెడికల్ కాలేజీలో వైద్యశాఖ ఉద్యోగికి చెందిన బినామీ ఏజెన్సీకే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాలకు అవకాశం ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తుండటంతో ఏదో ఒకరోజు రెగ్యులర్ అవుతుందనే ఆశతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. నిబంధనల ప్రకారం ఆయా శాఖల్లో ఖాళీ అయినా పోస్టులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది. అయితే చాలావరకు గుట్టు చప్పుడు కాకుండా ఏజెన్సీలు, సంబంధిత శాఖ అధికారులు కుమ్మక్కై, పోస్టులను బేరం పెట్టి, భర్తీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కోక్క పోస్టుకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పైగా ఆయా ఉద్యోగాన్ని బట్టి కొన్ని ఏజెన్సీలు వసూళ్లు చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అయితే ఏళ్ల తరబడి చాలిచాలని వేతనాలతో ఉద్యోగం చేస్తున్నప్పటికీ పర్మినెంట్ కాకపోవటంతో మధ్యలోనే ఉద్యోగానికి బైబై చెబుతున్న వారు కూడా ఉన్నారు. ఇవే కాకుండా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రావాల్సిన పీఎఫ్‌లు, ఈఎస్ఐలు అందకుండా పోతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోయినా ఆయా ఏజెన్సీలే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ తదితర వాటిని చెల్లించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా ఏజెన్సీలు ప్రభుత్వం నుంచి నిధులు రావటం లేదని నెలల తరబడి వేతనాలు ఇవ్వటం లేదు. అంతేకాదు పీఎఫ్, ఈఎస్ఐ వంటివి కూడా చెల్లించటం లేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఎఫ్‌లు కూడా ఏజెన్సీలు మాయం చేస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

అక్రమార్కుల్లో గుబులు

ఔట్‌సోర్సింగ్ నకిలీలను ఏరివేసేందుకు అన్ని జిల్లాల్లో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను సేకరించాలని ప్రభుత్వం ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. ఆయా శాఖల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆధార్ కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్‌లు సేకరించాలని ఆదేశించింది. ఒక్కొక్క ఉద్యోగికి ఒక్కో యూనిక్ నెంబరు కేటాయించి నేరుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాలో వేతనం జమచేసే ప్రయత్నంలో ప్రభుత్వం ఉన్నట్లుగా సమాచారం. ఇంటిగ్రేటెడ్ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్) పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పోర్టల్‌లో నమోదు చేసిన ఉద్యోగులకే ప్రభుత్వం వేతనాలు ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. దీంతో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల బినామీ దందాకు చెక్ పెట్టడంతో పాటు పని చేసే వారికే నేరుగా రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించనున్నారు. మరోవైపు ఇన్నాళ్లు బినామీ పేర్లతో.. తప్పుడు రికార్డులతో వేతనాలు మాయం చేసిన కొన్ని ఏజెన్సీల నిర్వాహకుల్లో గుబులు మొదలైంది.

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 25వేల మందికి పైగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఉండగా, వీరిలో ఎంతమంది నకిలీలు ఉన్నారనేది ఆసక్తికరంగా మారింది. అంతే కాకుండా ఎంతమంది బినామీ పేర్లతో సర్కారు సొమ్ముకు కన్నం వేశారో కూడా బయటకు రానుంది.

అకాల వర్షాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

- పంట నష్టం జరగకుండా చూడాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాను కారణంగా కురిసే అకాల వర్షాలతో పంట నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి పత్తి, ధాన్యం, మొక్క జొన్న వంటి పంటల కొనుగోలుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సీఎస్ కే రామక్రిష్ణారావు, ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకటొరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రెండు రోజుల పాటు తుఫాను ప్రభావంతో మన రాష్ట్రంలో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. జిల్లాలో ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాల వద్ద నష్టం వాటిల్లకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలని అన్నారు. నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం 100 శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతుల కొరత ఎక్కడైనా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. పంట కొనుగోలు విషయంలో ఏ చిన్న తప్పు జరిగినా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో రాబోయే రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందు వల్ల పంట కోతలు వాయిదా వేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కోతలు చేసిన మొక్కజొన్న, వరి వంటి పంటలు నాణ్యతా ప్రమాణాలు ఉంటే వెంటనే కాంటా వేసి కొనుగోలు చేయాలని, పంట తరలింపునకు వాహనాల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతుల కల్లాల వద్ద తేమ శాతం పరిశీలించి నాణ్యత ప్రమాణాలు ఉంటేనే కొనుగోల కేంద్రాలకు పంట తీసుకొని వచ్చేలా చూడాలని అన్నారు. సీఎస్ కె. రామక్రిష్ణారావు మాట్లాడుతూ రాబోయే 45 రోజుల నుంచి రెండు నెలల కాలంలో ధాన్యం కొనుగోలు ఉధృతంగా జరుగనుందని, అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ సజావుగా కొనుగోలు జరిగేలా చూడాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీవో మేన శ్రీను, డీసీవో సంజీవరెడ్డి, డీఏవో రవీంద్ర సింగ్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో 61 వినతులు

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 61 వినతులు వచ్చాయి. కలెక్టర్ దివాకర వాటిని స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రజలు అందించిన వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో దరఖాస్తులను పరిష్కరిం చాలని, పెండింగ్‌లో పెట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అద నపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేష్, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షాలతో పంట నష్టం వాటిల్లొద్దు

వీడియో కాన్ఫరెన్స్‌లో
మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో ములుగు కలెక్టర్ దివాకర, అధికారులు

ములుగు కలెక్టరేట్/కృష్ణకాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంట నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు పాటించాలని, జిల్లాలో వందశాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావ అన్నారు. హైదరాబాద్ నుంచి వారు సోమావరం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు నుంచి ఆ జిల్లా కలెక్టర్ దివాకర, భూపాలపల్లి నుంచి ఆ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాటాడుతూ రాబోయే రెండు రోజులపాటు తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాల వద్ద నష్టం వాటిల్లకుండా జాగ్రత్త చర్యలు పాటించాలని అన్నారు. అవసరమైన మేరకు టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలన్నారు. , నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం వందశాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. రైతులకు ఎక్కడా ఇబ్బందిలేకుండా సజావుగా కొనుగోలు జరిగేలా చూడాలని, పంటల కొనుగోలు ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలు, వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు సివిల్‌సప్లయ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పంటల కొనుగోలు విషయంలో ఎలాంటి అక్రమాలకు ఆస్కారం లేదని, ఎవరైనా సరే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో రాబోయే రెండ ంరోజులపాటు తూర్పు తెలంగాణ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట కోతలు వాయిదా వేయాలని రైతులను కోరారు. కోతలు చేసిన వరి, మొక్కజొన్న వంటి పంటలు నాణ్యత ప్రమాణాలు ఉంటే వెంటనే కాంటా వేసి కొనుగోలు చేయాలన్నారు. మార్కెట్‌కు చేరిన పంట అకాల వర్షాలకు తడవకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. సీఎస్ కె.రామకృష్ణారావు మాట్లాడుతూ వరి, పత్తి, మొక్కజొన్న పంటలను రైతుల వద్దనుంచి ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేయాలని, అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ సజావుగా కొనుగోలు జరిగేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ములుగు అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, డీఏవో సురేష్‌కుమార్, డీఎం డీసీఎస్‌వో రాంపతి, డీసీవో సర్దార్‌సింగ్, ఉద్యానశాఖ అధికారి సంజీవ రావు, మార్కెటింగ్ అధికారి, భూపాలపల్లి అదనపు కలెక్టర్ అశోక్‌కు మార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, డీఆర్డీవో పీడీ బాలకృష్ణ, ఉద్యాన శాఖ అధికారి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వెంకటాపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో రామప్ప రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఏఈవో సుకుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలుకేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలన్నారు. సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ కూడా అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు మిల్కూరి ఐలయ్య, చెన్నోజు శ్రీను, మాడిశెట్టి కోటి, రెడ్డి గణపతి, ఆత్మ డైరెక్టర్లు గాలి సమ్మయ్య, కాయిత రవి, రైతులు సాద యాదగిరి, కొంపల్లి రాజిరెడ్డి, రాజయ్య, పర్వతాలు, నరెడ్ల జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా రమేష్



వెంకటాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) నూతన మండల అధ్యక్షుడిగా యాసం రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండలకేంద్రంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా ఇన్‌చార్జి చాతాళ్ల రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాసం రమేష్, కార్యదర్శిగా చెన్నం గౌతమ్, అధికార ప్రతినిధిగా చెన్నం రమేష్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా వేల్పుల వెంకటేష్, అధికార ప్రతినిధిగా కొడాలి సత్యంలను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో నాయకులు వావిలాల స్వామి, రమేష్, గుగ్గిళ్ల నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

గోవిందరావుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.11కోట్లు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ సోమవారం మండలకేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ధనసరి సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ ములుగు నియోజకవర్గంలోని అన్ని మండలాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.468 కోట్ల 52లక్షల నిధులు విడుదల చేయడం శుభపరిణామమని అన్నారు. మంత్రి సీతక్క అంటేనే అభివృద్ధికి మారుపేరని, మండలకేంద్రానికి అంతర్గత సీసీరోడ్ల ఏర్పాటుకు రూ.11 కోట్లు విడుదల చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మద్దాలి నాగమణి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రస్పూత్ సీతారాంనాయక్, పీఏసీఎస్ అధ్యక్షుడు పన్నాల ఎల్లారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్య, నాయకులు తేళ్ల హరిప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటీడీఏ భవనాన్ని తరలించొద్దు : ఆదివాసీ జేఏసీ

ఏటూరునాగారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారంలో ఉన్న ఐటీడీఏ భవనాన్ని మరో చోటుకు తరలించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని ఆదివాసీ సంఘాల జేఏసీ జేఏసీ చైర్మన్ పూనెం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీడీఏ భవనం పాతబడిందనే సాకుతో దాన్ని జంబోరి గ్రౌండ్ స్థలంలోకి మార్చాలనే ఆలోచనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తెలిపారు. క్రాస్ రోడ్డులో ఉన్న ప్రస్తుత ఐటీడీఏ స్థలంతో ఆదివాసీలకు చారిత్రక గుర్తింపు ముడిపడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్ కుమార్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్, జేఏసీ వైస్ చైర్మన్ ఊకె రవి, తుడుందెబ్బ ములుగు జిల్లా అధ్యక్షుడు చందా మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాపుల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి ఎంపీడీవోగా ప్రసాద్

కృష్ణకాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఎంపీడీవోగా తరుణి ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల గ్రూపు-1 ఫలితాల్లో ఎంపికైన ఆయన్ను భూపాలపల్లి ఎంపీడీవోగా నియమించారు.ఈ సందర్భంగా ఆయన్ను కార్యాలయ అధికారులు, మండల కార్యదర్శులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో నాగరాజు, సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

మహాముత్తారం ఎంపీడీవోగా నిశాంత్

మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): మహాముత్తారం ఎంపీడీవోగా బి.నిశాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌రావు నుంచి చార్జ్ తీసుకున్నారు. హనుమకొండకు చెందిన ఆయన ఇటీవల గ్రూప్-1 అధికారిగా ఎంపికయ్యారు. ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన నిశాంత్‌కు కార్యాలయ సిబ్బంది సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలి

కాటారం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటేలా యువ కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీటూరి మహేష్‌గౌడ్ అన్నారు. మండలంలోని గుమ్మళపల్లి, ఒడిపిలవంచ గ్రామ పంచాయతీల పరిధిలో సోమవారం యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక కోసం నాయకులు సమావేశమై నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి, మహేష్ కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. గుమ్మళ్లపల్లి కమిటీ అధ్యక్షుడిగా ఆత్కూరి సంపత్, ప్రధాన కార్యదర్శిగా దీకం రాజబాపు, ఉపాధ్యక్షుడిగా భక్తు వీరకుమార్, కోశాధికారిగా మంథెన దిలీప్, కార్యదర్శిగా కొండేడ ప్రవీణ్, అధికార ప్రతినిధిగా తడండ్ల సందీప్, ప్రచార కమిటీ కన్వీనర్‌గా నడిగోట రాజేందర్ ఎన్నికయ్యారు. ఒడిపిలవంచ కమిటీ అధ్యక్షుడిగా ఎలవేన రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా మాదరి బాపు, ఉపాధ్యక్షుడిగా కొరళ్ల సాయికుమార్, కోశాధికారిగా పర్శవేన అనిల్, కార్యదర్శిగా పల్లె సతీష్, అధికార ప్రతినిధిగా వావిళ్ల శరత్, ప్రచార కమిటీ కన్వీనర్‌గా వడ్లకొండ రాజస్వామి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రవికుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

టేకుమట్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం నవంబరు 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన విశాల మహాధర్నా, ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతి కోరారు. మండల కేంద్రంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర నాయకుడు సంగి రవి, జిల్లా ఉపాధ్యక్షుడు ఓంకార్, జిల్లా ఇన్‌చార్జి బచ్చల కుమార స్వామి, జిల్లా కార్యదర్శి తాళ్లపల్లి రమేష్, నాయకులు భగత్, రవి శర్మ, జీడి రాజకొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం

చిట్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరూ చైతన్య వంతులై మాదక ద్రవ్యాలను నిర్మూలించాలని మిషన్ పరివర్తన్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ ప్రసాద్ అన్నారు. మండలంలోని తిరుమలపురం ప్రభుత్వ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై రంగోలి పోటీలను సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, పాఠశాల హెచ్‌ఎం నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులకు ప్రాధాన్యమివ్వాలి

కృష్ణకాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే వినతులకు అధిక ప్రాధాన్యమిచ్చి వాటిని వెనువెంటనే పరిష్కరించాలని అధికారులను అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. భూపాలపల్లి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా 13 మంది తమ సమస్యలపై అదనపు కలెక్టర్‌కు తమ వినతులను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ప్రజావాణిలో వచ్చిన వినతులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, ఆయా సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీవో రవి తదితరులు పాల్గొన్నారు.

మహార్యాలీలో పాల్గొనండి : ఎమ్మార్పీఎస్

కాటారం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో నవంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించే దళితుల ఆత్మగౌరవ మహార్యాలీలో పాల్గొనాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి శ్యాంబాబు కోరారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథెన చిరంజీవి అధ్యక్షతన మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో శ్యాంబాబు మాట్లాడారు. . ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, నాయకులు నేముల శ్రీనివాస్, దోర్నాల రాజేందర్, మంద కిరణ్, తిరుపతి, చందు, సాంబయ్య, సారంగపాణి, సంపత్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కుమరం భీం వర్ధంతి

మంగపేట (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కుమరం భీం వర్ధంతిని మన్య సీమ పరిరక్షణ సమితి డోలుదెబ్బ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడు తాటి నాగరాజు, ఆదివాసీ జేఏసీ నాయకుడు ఆదినారాయణ, తుడుందెబ్బ నాయకులు కురుసం రమేష్, నగేష్, సమ్మయ్య, ప్రశాంత్, ఏవైఎస్ మండల అధ్యక్షుడు మొగ్గిల సురేష్, కుంట ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

● టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం బీసీ జేఏసీ మండల కన్వీనర్ నేరేళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో కుమరంభీం వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య, వివిధ సంఘాల నాయకులు బండి రాజేంద్ర ప్రసాద్, సంగి రవి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



పత్తి కొనుగోలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించి మద్దతు ధరను పొందాలని రైతులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు సూచించారు. మండలంలోని శాంతినగర్ శివారు ఆంజనేయ కాటన్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. పత్తిలో అధిక తేమలేకుండా రైతులు ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. పంట సరుకును తీసుకొచ్చే ముందు కపాస్ కిసాన్ యాప్‌లో రైతు వివరాలు నమోదు చేసుకోవాలని, స్లాట్ బుక్ చేసుకోవా లన్నారు. సీసీఐ అధికారులు, మిల్లర్ల నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురిచే యొద్దన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సౌకర్యాలను కల్పించాలన్నారు. రైతులు దళారులకు పత్తిని విక్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. కపాస్ కిసాన్ యాప్‌ను తొల గించాలని పత్తి రైతు సంఘం రాష్ట్ర కోకన్వీనర్ చింతల రజనీ కాంత్ ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంబంధిత సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌కుమార్, మార్కెట్ ఇన్‌చార్జి కా ర్యదర్శి షరీఫ్, సీసీఐ అధికారి పట్టాభిరామయ్య, మిల్లు యజ మాని ఆకుల బాలచందర్, ఏఎంసీ వైస్ చైర్మన్ రఫీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా నాయకులు మధు వంశీకృష్ణ, పులి తిరుపతిరెడ్డి, డొడ్డి కిష్టయ్య, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, ఏఎంసీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిపై మంత్రులు దృష్టి పెట్టాలి

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



రోగులతో సౌకర్యాల గురించి ఆరా తీస్తున్న గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సర్కారు ఆస్పత్రులపై ప్రజల్లో పూర్తిగా నమ్మకం సన్నగిల్లుతోందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా ఆస్పత్రిపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లాకు చెందిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టి పెట్టాలని, మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రిని ఆయన సోమవారం సందర్శించారు. ఆస్పత్రి నిర్వహణలో ఏర్పడిన సమస్యలపై సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్తా చెదారం ఎక్కడికక్కడే పేరిగిపోయిందని, దుర్వాసన వస్తోందని అన్నారు. అపరిశుభ్రతపై ప్రశ్నించిన వారిపై సిబ్బంది దురుసుగా మాట్లాడటం సరికాదన్నారు. అలాగే, కలెక్టర్ నెలలో ఒక్కసారైనా ఆస్పత్రిని సందర్శించాలని కోరారు. ఆయన వెంట జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ యాదవ్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ హరీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ మహిళా విభాగం టౌన్ అధ్యక్షురాలు మాదాసు తిరుపతమ్మ, మాజీ కౌన్సిలర్లు దార పూల మ్మ, ఎడ్ల మౌనిక, నూనె రాజు, నాయకులు సెగ్గం సిద్ధు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన ఆమ్‌ఆద్మీ పార్టీ నేత

ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్న మంత్రి రాకేష్ బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆయనకు గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఆన్‌లైన్ సేవలను సీఎస్సీ సెంటర్లకు కేటాయించాలి

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ సేవలను సీఎస్సీ సెంటర్లకు కేటాయించాలని కోరుతూ జిల్లాలోని వీఎల్‌ఈలు సోమవారం కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందజేశారు. గ్రామీణ, పట్టణ స్థాయిలో ఉన్న సీఎస్సీ సెంటర్లు 15 ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పలు సేవలను ప్రజలకు చేరవేస్తూ కొత్త సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నాయని అన్నారు. రాష్ట్ర సంక్షేమ పథకాలను సీఎస్సీ సెంటర్లకు కేటాయిస్తే ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం ఉంటుందని, ప్రభుత్వాల ఆశయాలు నెరవేరుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌ఈలు యుగంధర్, రాజేందర్, ప్రభాకర్, రాజు, వినోద్ పాల్గొన్నారు.

సీసీలపై చర్యలు తీసుకోవాలి

చిట్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐకేపీలో విధులు నిర్వర్తిస్తున్న సీసీలపై చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్‌సెల్‌లో వీవోఏలు పిర్యాదు చేశారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్డీవో, పీడీకి వినతిపత్రం అందజేశారు. పిర్యాదు చేసినవారిలో వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు కొమురవెల్లి రజిత, కార్యదర్శి ఓంకార్, కోశాదికారి కోమలత, గౌరవ అధ్యక్షురాలు రుక్మాబాయి, సహాయ కార్యదర్శి సాలయ్య తదితరులు ఉన్నారు.

గంజాయి పట్టివేత

(5వ పేజీ తరువాయి)

కూరం దుర్గయ్య, సోడి జోగ అలియాస్ జోగయ్య అనే మరో నలుగురితో కలిసి రెండేళ్లుగా గంజాయి వ్యాపారం చేస్తూ అక్రమంగా సంపాదిస్తున్నట్లు అంగీకరించారు. తెలంగాణలో గంజాయి దొరకకపోవడంతో తమ వద్దకు వచ్చిన వరంగల్ ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు విక్రయించేందుకు ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి దగ్గరలోని డొంకరాయ, కేర్లంపల్లి, బాదారి, చిత్రకొండ, వడియాకేంపాడ్ ఏరియాల్లో కిలో రూ. 4వేల చొప్పున మొత్తం 28 కేజీల గంజాయిని కొనుగోలు చేసినట్టు తెలిపారు. దానిని కిలో రూ. 10వేల చొప్పున అమ్మి, ఆ గంజాయిని ఎవరికీ దొరకకుండా వరంగల్ ఏరియా వరకు తోడుగా తీసుకెళ్లడానికి మూడు బైకులపై నాలుగు బ్యాగుల్లో వస్తుండగా మార్గమధ్యలో వెంకటాపురం పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తుల వద్ద, పారిపోయిన వ్యక్తులు వదిలివేసిన బ్యాగుల నుంచి మొత్తం 14.213 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితులు కురం దుర్గయ్య, సోడి జోగయ్య అలియాస్ జోగ, శోభనబోయిన చంచు, మరొక గుర్తు తెలియని వ్యక్తిపై, పట్టుబడిన ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తలించారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు అడిషనల్ ఎస్పీ శివం ఉపాధ్యాయ పేర్కొన్నారు. ఈ సమావేశంలో వెంకటాపురం సీఐ ముత్తం రమేష్, ఎస్సై తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్కు.. కిక్కు

(5వ పేజీ తరువాయి)



టాప్ 1 మల్లంపల్లి షాపును కైవసం చేసుకున్న మాధవి

జిల్లాలోని మల్లంపల్లి దుకాణానికి వచ్చాయి. ఈ షాపునకు మొత్తంగా 77 దరఖాస్తులు దాఖలు కాగా అదృష్టం ఎవరికి దక్కుతుందోననే ఉత్కంఠ అధికారులు, వ్యాపారుల్లో నెలకొంది. ఈ క్రమంలో మల్లంపల్లి షాపుతో మరో రెండు షాపులు సైతం మహిళలకే అవకాశం దక్కింది. మల్లంపల్లి షాపు వెంకటాపూర్‌కు చెందిన రెడ్డిమల్ల మాధవికి దక్కింది. అలాగే, భూపాలపల్లి జిల్లాలో అత్యధికంగా మొగుళ్లపల్లి షాపునకు 63 దరఖాస్తులు రాగా ఆత్మకూరుకు చెందిన రాహుల్‌రెడ్డికి సొంతమైంది. ఇక కాటారం స్టేషన్ పరిధిలోని మహాముత్తారం మండలం యామన్‌పల్లిలోని దుకాణానికి 60 దరఖాస్తులు రాగా గోదావరిఖనికి చెందిన కోటపాటి సుమలత అనే మహిళకు దక్కింది. ములుగు జిల్లా జంగాలపల్లిలోని దుకాణానికి 61 దరఖా స్తులు రాగా ములుగు జిల్లాకు చెందిన తక్కళ్లపల్లి శ్రీలత అనే మహిళకు అదృష్టం వరిం చింది. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరిం టెండెంట్ వి.శ్రీనివాస్, భూపాల పల్లి డీఎస్పీ సంపత్‌రావు, భూపాలపల్లి, కాటారం, ములుగు, ఏటూరునాగారం స్టేషన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న బీజేపీ నాయకులు

మహాముత్తారం, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుకునూర్ నుంచి నిమ్మగూడెం వరకు పూర్తిగా దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతుల చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయ కులు సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఇది కనుకునూర్ నుంచి సింగంపల్లి, యత్నారం మీదుగా నిమ్మగూడెం వరకు కొనసాగింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు పూర్ణచందర్ మాట్లాడుతూ కనుకునూర్ నుంచి నిమ్మగూడెం వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైనా మంత్రి శ్రీధర్‌బాబు పట్టించుకోవడం లేదని విమర్శించారు. మారుముల ఆదివాసీ, గిరిజన గ్రామాలకు రవాణా అస్తవ్యస్తమైనా ప్రభుత్వానికి పట్టడం లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా స్పందించకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఎం.డి.రఫి, నాయకులు ముత్యాల రాజయ్య, సదువలిరావు, నవీన్ నాయక్, నితిన్ నాయక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం

కాటారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని బయ్యారం జీపీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు సోమవారం ప్రారంభించారు. గ్రామపంచాయతీ పరిధిలో ఐదు ఇళ్లు మంజూరు కాగా తొలి విడతలో అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ముగ్గురు లబ్ధిదారులు జ్యోతి, రవళి, కీర్తనతో నిర్మాణం కోసం ముగ్గు పోయించి పనులు ప్రారంభించారు. మిగతా ఇద్దరు లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణం ప్రారంభం చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ చినాల బ్రహ్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పూలమ్మ, సమ్మక్క, కాంగ్రెస్ నాయకులు జాగిరి రాజబాబు, శ్రీనివాస్, జక్కిరెడ్డి, మాజీ సర్పంచ్ ఇనగాల లక్ష్మిలింగయ్య, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.